మినీ కథ:

# మనవాడు

ఆయనకి సన్మానం జరిగింది. యించక్కటి వేదికమీద రంగు రంగుల నిలువెత్తు పూల దండల్లో ముంచెత్తి ఉచితాసనంమీద కూర్చోబెట్టారు. నుదుట తిలకం దిద్దారు. గంధం పూసారు. హారతి పట్టారు. అక్షతలు జల్లారు. వేదోక్తంగా మంత్రాలు చదివారు. హృదయం విప్పి విశాలమైన సన్మాన పత్రాలు చదివారు. శక్తివంచన లేకుండా తలోవిధంగా పొగిడారు. ఉచిత రీతిని ఆయన సమాధానం కృతజ్ఞత చెప్పాడు.

యివన్నీ చేసి అంతా నీరసించే సైముకి తేనీటి విందు జరిపారు.

గ్రూపుగా టేబిల్సు ఏర్పాటుచేసిన విందులో గ్రూపుల సంభాషణ ఈ మాదిరిగా జరిగింది.

ఒకచోట: "జి. ఆర్. లూ అంటే ఎవరో అనుకున్నా. 'జి. రాములు' అని మీటింగు కొచ్చేవరకూ తెలీదు. మన తెలుగు వాడే నన్నమాట. అంతేనండీ. మన తెలుగు వాడు ప్రపంచ విఖ్యాతమైన పేరు తెచ్చుకుంటేనేగానీ మన కంటపడడు."

మరోచోట: "చూసావ్? ఆయన్ది మన కోస్తా ప్రాంతమే. మన జిల్లా. పైపెచ్చు మనకోన సీమ. ఎంత సేపూ కొబ్బరి కాయలు లెక్క పెట్టుకోడమేగానీ ఆయన ఘనత గుర్తించలేక పోయాం."

ఒక టేబిల్: "విన్నావా బ్రదర్. ఆయనది మన తాలూకా యేనట. మన తాలూకా వాడికి పేరొచ్చిందంటే మనకి కాదూ?"

మరో టేబిల్: "ఆశ్చర్యకరమైన వార్త. మన పుల్లేటికుర్రులో పుట్టాడట ఆయన. తెలివి తక్కువ వాళ్ళం కనుక్కోలేకపోయాం. మనం విడిగా పుల్లేటికుర్రులో ఆయనకి సన్మానం చెయ్యాలి."

ఒకమూల: "జి. రాములుగారు ఏ వర్ణమో కని పెట్టావా? మనకాస్టే. ఆ లీవి దర్పం వర్చస్సు ప్రోగ్రెస్సు మన జాతిలో కాకపోతే యింకెక్కడున్నాయి."

మరోమూల పీటన్నిటినీ అధిగమించి ఒకాయన జి. రాములుగార్ని సన్నిహితంగా గమనించ సాగాడు. చిన్నప్పుడు వేలు విడిచిన మేనల్లుడొకడు యింట్లోంచి పరారీ అయి దేశాల పాలయ్యాడు. వాడేనేమోనని అనుమానంతో పుట్టు మచ్చల కోసం వెతుకు తున్నాడు.

— గుత్తుల భాస్కరరావు

# హితవు

నా గతంలోకి రాకు—
అంతులేని నా ఆలోచనల్లో
సమాధి అయిపోతావ్!
నా భావిలోకి రాకు—
నా భావ సుమా గుచ్ఛాలలో
మరుగున పడిపోతావ్!
నా కలల్లోకి రాకు—
నా ఉలికిపాటుతో
అదృశ్యమయిపోతావ్!
నా కలంలోకి రాకు—
నా కవితా ప్రవాహంలో
కొట్టుకొనిపోతావ్!
అందుకే ఓ చెలీ,
నా కన్నుల్లో నీ కళ్ళతో
నీ ప్రతిబింబం చూచుకుంటూ
మరీ రా!
నిన్ను నా హృదిలో సుధగా
దాచుకుంటాను కలకాలం!

—గంగుల నరసింహారెడ్డి